# స్వప్నవర్తకుడు

శింగీతం లక్ష్మీకళ్యాణి



చాలా శతాబ్దాలకు పూర్వం దండకారణ్య సమీపంలో ఒక రాజ్యాన్ని ఒక వృద్ధ రాజదంపతులు పాలిస్తూ వుండేవారు. వారికి ఎంతకాలానికీ సంతతి కలుగకుండడంవల్ల దానాలు, ధర్మాలు, వ్రతాలు మున్నగునవి ఎన్నో చేశారు. కాని వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యేసరికి విరక్తిచెంది విరాగులై తుదకు వా రిరువురు తమ శేషజీవితాన్ని పరమేశ్వరుని ధ్యానిస్తూ గడుపజొచ్చారు. మహేశ్వరుడు ఆ వృద్ధదంపతులయెడ కరుణించి ఒకేరాత్రి వా రిరువురికి స్వప్నంలో కనుపించి, కావలసింది కోరుకో మన్నాడు. రాజు క్లుప్తంగా ఒక పుత్రుణ్ణి కోరాడు. కాని, రాణి రేవెల్గు వెలుగుతో ధగధగ మెరుస్తున్న చంద్రశేఖరుని జటాజూటాన్నిచూచి, భక్తిపారవశ్యంతో, "ఓ వరదాతా! నా పుత్రునిలోని ఏ ఒక్క అణువైనను లేక ఆ అణువులో ఒక్క సహస్రాంశమైనను సరే నిన్నుపోలియున్నచో ధన్యురాలను. కనుక నన్నొకసారి నీ కేశములలోనొకి భగవదంశను నాకు ప్రసాదించవలసినది" అని కోరింది. అప్పు డీశ్వరుడు తనలో, "ఎంత సూక్ష్మమైనదైనను నాలోని భాగము అత్యంత శక్తియుతమైనది. అది మానవ మాత్రునికి అతీతమై, అతని స్థైర్యాన్ని చెదరిస్తుంది. కాని నే నీమెకు ముందే వరమిచ్చివున్నాను గనుక ఈమె కోరిక చెల్లించితీరాలి. ఈమె పుత్రుడు తన పూర్వజన్మకృతఫలితాన్ని అనుభవించక తప్పదుకదా!" అని అనుకుంటూ తన తల వెంట్రుక నొకదానిని త్రుంచి, రాణి చేతిలోపెట్టి అంతర్థానమయ్యాడు.

ఉదయమున మేల్కొని రాజు, రాణి తమ స్వప్నములను అతి ఉత్సాహంతో పోల్చుకుంటూంటే —ఆశ్చర్యము!—రాణి చేతిలో అగ్ని జ్వాలలతో మెరిసే తీగలాంటి కేశము కనబడింది. ఆనందభరితులై వా రిరువురు ఆ కేశాన్ని ఒక సువర్ణ మంటపంలో వుంచి, దాని చుట్టూ ఒక ఆలయాన్ని కట్టించి పూజించారు. కొంతకాలానికి రాణి ఒక పుత్రుణ్ణి ప్రసవించింది. తగిన పేరు పెట్టాలనే సంకల్పంతో తల్లిదండ్రు లతనికి రుద్రాలకుడని నామకరణం చేశారు. పేరుకుతగ్గట్టు అతను చిన్నప్పుడు ఆటలాడుకునే సమయంలో ఎర్రనైన అతని తల వెంట్రుకలు గాలికి ఎగురుతుంటే అవతరించిన వాయుసఖునిలా ప్రకాశించేవాడు.

అతను పెరిగి పెద్దవాడయ్యేసరికి ఇనుమడించిన బలంతో, ఉబికివచ్చే ఉత్సాహంతో ప్రజ్వరిస్తూ, ఎవ్వరికీ లొంగని మదపుటేనుగులాగ, ఎవ్వరినీ లక్ష్యం చేయని రాతికొండలాగ రూపొందాడు. ఇది చూచి అతని తండ్రి రాణితో, "నీవు పరమేశ్వరుని వర ప్రసాదంవల్ల పుత్రుణ్ణి కన్నావుగాని, చూడబోతే వీడికి ఈశ్వరుని గుణగణాలకు బదులు అతనిబంటైన నందిచేష్టలు అబ్బుతున్నాయి" అంటూ చింతించాడు.

రుద్రాలకుణ్ణి మగసిరి అలంకరించేటప్పటికి అతనిలో ఉత్సాహం పొంగి, వరదలోవున్న నదీ ప్రవాహంలాగ గట్లు తెంపుకొని ప్రవహించింది. శక్తిబలసంపన్నులైన పురుషుల నందరిని బలప్రదర్శనాలలో గెలిచి మేటి అనిపించుకున్నాడు. అంతటితో ఆగక, మత్తెక్కిన తేనెటీగలాగ చేజిక్కిన అలరుబోడుల అందాన్ని క్రోలి మధువును, శీలాన్ని

(40-వ పేజీ చూడండి)

# స్వప్నవర్తమానము

(24-వ పేజీ తరువాయి)

అపహరించి తన ఇష్టవచ్చినట్టు విహరించసాగాడు. ఇదిగాంచి తలిదండ్రులు చింతాక్రాంతులై తనయునికి వివాహంచేస్తే, అతని ఉడుకు తగ్గి, స్థిమితం పొంది, వంశాన్ని, రాజ్య భారాన్ని మోయగలుగుతాడనుకొని తమ అభిప్రాయాన్ని కుమారునికి వెలిబుచ్చారు. కాని రుద్రాలకుడు వారి కోరికకు గట్టిగా నవ్వి, "వాడిన పువ్వున్ని ఎవరైనా ఆశిస్తారా? తలలో పెట్టుకున్న కొద్దిసేపే విరిసిన పువ్వుకు విలువ. స్త్రీ కూడా అంతే. కన్యలు తియ్యని తేనెవంటివారు. కాని వివాహం బాధకరమైన తేనెటీగ కాటువంటిది. ఆ కాటునుండి తప్పుకొని, తేనెను సంపాదించగలవాడే కుశాగ్రబుద్ధి. పైగా స్త్రీలు దూరపుకొండలు! వంపులు తిరిగిన సర్పాలు. మెరిసే అగ్ని. భ్రాంతినిగొలిపే ఎండమావులు. అంతేకాదు, స్త్రీకి సహనంలేదు. ఈర్ష్య ఎక్కువ. అధికారం తనదిగా వుండాలని కోరుతుంది. ఆమెను తృప్తిపరచడానికి భర్త తన తల నొగ్గాల్సిందే. లత కౌగిలిలో చిక్కి, ఆయువు తీరకముందే కృశించి నశించే చెట్టులాంటివాడే భర్తకూడా! ఎంత చక్కటి పువ్వును ధరించినా నే నటువంటి చెట్టును కాలేను. ఆ సుందరి పదివేల రాధల అందానికి సరితూగినా నేనుమాత్రం వివాహం చేసుకోను. బానిసత్వంతో భార్యను కొనను" అంటూ ఉపన్యసించాడు. తలిదండ్రులు బతిమిలాడినకొద్దీ ఇంకా మొండి పట్టుతో రుద్రాలకుడు వారి కోరికను తిరస్కరించాడు. తుదకు విసుగుచెంది దుఃఖపీడితులై ఆ వృద్ధదంపతులు గుండెజబ్బుతో అసువులను బాశారు.

తలిదండ్రులు మరణించగానే ఒక అడ్డం తొలగిందని ఆనందిస్తూ, రుద్రాలకుడు మరుసటి దినమే తన గుర్రాన్నెక్కి అనుచరులతో వేటకు వెళ్ళేడు. అరణ్యమార్గంలోంచి శరవేగంతో పరుగెత్తే రాజా గుర్రంతో సరిసమానంగా వెళ్ళలేక, అతని అనుచరులు వెనుకపడ్డారు. రాజామాత్రం తనొక్కడే అలా ముందుకు సాగిపోతూంటే అరణ్య మధ్యంలో ఒకచోట అతనికి జగదేకసుందరి అయిన ఒక స్త్రీ కనబడింది. ఆమె ఒక ఋషి కుమార్తె. ఆమె సౌందర్యం చూడగనే అతడు ముగ్ధుడై పోయాడు. ఆమె అందం సర్పంలాగ అతని హృదయంలో దూరుకొనివున్న వివాహద్వేషాన్ని ఒక్కసారిగా కాటువేసి చంపివేసింది. వెంటనే రాజా ఆ సుందరి హృదయాన్ని గెలిచి, తన రాజ్యానికి తీసుకెళ్ళి ఆమెను తన అర్ధాంగిగా, రాణిగా చేసుకున్నాడు. నాటినుండి రుద్రాలకుని జీవితం మారిపోయింది.

భర్తగా అమ్ముడుపోయి, బానిసనుకానని శపథం చేసిన రాజా ఇప్పుడు తన రాణికి హృదయపూర్వకంగా దాసుడయాడు. అతడు ఆమెను విడిచి ఒక్కక్షణమైనా వుండలేక, ఆమె తన అర్ధాంగి అనే నామం సార్థకం చేశాడు. రాయంత కూడా విడదీయలేని క్షీర నీరాల్లాగ కలిసి మెలిసి వారు ఆనందంగా గడిపేరు. మారిన రాజాను చూచి ప్రజలు ఎంతో సంతోషించేరు. "రాజాగారు ఇప్పుడు భార్యావ్యామోహంలోపడి, రాచకార్యాలు వదిలేసినను వరవాలేదు. ఇదంతా మన మంచికే వచ్చింది. కొన్నాళ్ళు గడిచిన తర్వాత అంతా చక్కబడి రాజాగారు ఆదర్శప్రాయులై, వంశానికి, రాజ్యానికి ఒక జ్యోతిలా ప్రకాశిస్తారు. అప్పుడు స్వర్గంలోవున్న తలిదండ్రులు నిజంగా చాలా సంతోషిస్తారు" అంటూ ప్రజలు తమలో తాము అనుకున్నారు.

ఈ విధంగా రాజా దీపంచుట్టూ తిరిగే పురుగులాగ భార్య సన్నిధిని వదలక లోకాన్ని మరచి ఆనంద పారవశ్యంలో మునిగిపోయాడు. ఇదే మంచి అవకాశమని తలచి చుట్టూవున్న శత్రురాజులంతా జత చేరి, అతని రాజ్యంపై దండెత్తేరు. సరిహద్దున ఉన్న సామంతులుకూడా కప్పం చెల్లించడం మానేసి శత్రువులవైపు చేరారు. ఈ పరిస్థితిలో రుద్రాలకుడు తన భార్యను విడిచి రణరంగానికి వెళ్ళక తప్పిందికాదు. యుద్ధానికి వెళ్ళేముందు రాజు తన రాణిని సమీపించి ఆప్యాయంగా "ప్రాణేశ్వరీ! మనరాజ్యం ఇపుడు చాలా అపాయ స్థితిలో వుంది. మనల్ని నిశ్చితంగా నడువనీయక ఈ ముళ్ళు గుచ్చుకుంటున్నాయి. వీటిని వేళ్ళతోసహా ఆ మూలాగ్రంగా లాగిపారేస్తేగాని, మన జీవితమార్గం ఆనందదాయకంగా వుండదు. అయినా నిన్ను విడిచి నేనొక్కక్షణమైనా ఉండగలనా? కన్నుమూసి తెరిచేలోగా శత్రువులను పరిమార్చి నేను నీముందువచ్చి వాలతాను" అంటూ పరిపరివిధాల బుజ్జగించి ఈ వియోగాన్ని కల్గించిన శత్రురాజుపై క్రోధాగ్నిని కక్కుతూ యుద్ధానికి బయల్దేరాడు. కాని వెళ్ళినంతసేపు పట్టలేదు. తుపానులా పిడికివచ్చిన రుద్రాలకుని ధాటికి ఆగలేక శత్రువులు అతని శరణుజొచ్చారు. తన అపూర్వ పరాక్రమంతో సంపూర్ణ విజయాన్ని గైకొన్న రాజా మరుక్షణం ఒక అనుచరుణ్ణి వెంటనిడుకొని మనోవేగంతో తన రాణిని కలుసుకోడానికి తిరుగు ప్రయాణం సాగించాడు.

రాజా గుర్రంమీద వెళ్తున్నాడన్నమాటేగాని అతని కళ్ళకు భార్య స్వరూపంతప్ప, ఇంకేమీ కనబడడంలేదు. సూర్యునితో పోటీపెట్టుకున్నాడా అన్నట్టు ముందు వెనుకలుకూడా చూడకుండా పయనంచేస్తూ చివరికి సూర్యాస్తమయ సమయానికి నగరం సమీపించాడు. సంధ్యవెలుగులో దూరాన్నుంచి కోటగోడలు స్పష్టంగా కనబడ్తున్నాయి. కోట కన్పించగానే ఆనందం పట్టలేక అత్యుత్సాహంతో తన నగరం ప్రవేశించాడు. దుమ్మును విరజిమ్ముతూ, సుడిగాలిలా రాజ వీధిలోనుండి వెళ్తూంటే ప్రజలు బెదిరి ఇటూ అటూ పరుగెత్తారు. కోటద్వారంలోంచివెళ్ళి అంతఃపురం చేరిందే తడవుగా గుర్రంమీదినుంచి క్రిందికి ఉరికి, అంతఃపురమందిరంలోకి పరుగిడి సంతోషంతో పరిచారకుల నుద్దేశించి "మహారాజా సురక్షితంగా వచ్చారు. రాణిరాకకోసం వేచియున్నారని తక్షణం విన్నవించండి" అంటూ బిగ్గరగా ఆజ్ఞాపించాడు. కానీ, ఇది విన్న సేవకులు నిర్ఘాంతపోయి రాజాముఖంచూస్తూ, మౌనంగా నిలబడ్డారు. రాజాకిదేమీ అర్థం కాలేదు. ఉగ్రుడై చుట్టూ చూశాడు. కొద్ది సేపటికి అంతఃపురంలోవున్న వృద్ధ సేవకుడు ముందుకువచ్చి, చేతులు జోడించి వణుకుతున్న కంఠంతో "మహారాజా! వార్తాహరులు తమర్ని కలుసుకోలేదా?" అన్నాడు. రాజా అర్థం కాక, "ఏమిటది? త్వరగా చెప్పు ఏమిటి?" అంటూ గర్జించాడు. సేవకుడు మాట్లాడలేక మాట్లాడుతూ, "మహారాజా! ఏం చెప్పను? మూడు రోజులక్రితం. . . . .మహారాణిగారు ఒక విషజ్వరం తగిలి అకాలంగా మరణించారు" అని విన్నవించాడు. ఈ వార్త వినడంతోనే రాజా నెత్తిన పిడుగుపడ్డట్టైంది. ఒక్కక్షణం శూన్యంగా చూచి రాజా క్రిందపడి మూర్ఛిల్లిపోయాడు.

## 2

పరిచారకులు మూర్ఛపోయిన రాజాను కొనిపోయి హంసతూలికాతల్పంపైన పడుకోబెట్టారు. విగతాసువునిలా పడున్న రాజానుచూచి అంతఃపురమంతా దుఃఖంతో ఆందోళనతో నిండిపోయింది. రాజ్యంలోని వైద్యులందరూవచ్చి, పలువిధములైన ఔషధములతో నయం చేయడానికి ప్రయత్నించారు. ఎట్టకేలకు కొద్ది కొద్దిగా రాజా తెప్పరిల్లుకున్నాడు. కాని రాజా ధోరణి పూర్తిగా మారిపోయింది. పిచ్చివానిలా తన దేహాన్ని తనే కొట్టుకుంటూ, చేతులు కరచుకొని, జుట్టు పీక్కొనేవాడు. క్షణ క్షణం భార్యను తలచుకొని ఏడుస్తూ, హృదయేశ్వరి జాడకోసం అంతఃపురమందిరాలంతటా వెతికేవాడు. ఆమె కనుపించకపోతే ఉగ్రుడై ఎదుట కనిపించిన సేవకులమీద విరుచుకపడేవాడు.

---

ఒక ఉపన్యాసకుడు: టాగూరు కవిత గొప్పది ఆయన భావాలు ఉన్నతాలు. ఉపమానాలు అప్రమేయాలు. ఇదిగో ప్రేమను గూర్చి చెపుతూ యేమన్నాడో చూడండి. "ప్రేమఅంటే మన పంపులోని నీరుకాదు, యెప్పుడు త్రిప్పితే అప్పుడు రావడానికి. అది వచ్చినపుడే వస్తుంది. రాక పోతే రానేరాదు."

ఒక శ్రోత: అయ్యా! టాగూరు మన టౌనులో కాపురముండి వ్రాసివుంటే ప్రేమ అనేది మనపంపు నీరువంటిదే అని వ్రాసివుండును కదా!

హెచ్. సత్యనారాయణరావు, (కర్నూలు)

---

వివరిమాటకూ లొంగక ఉన్మత్తుడైన రాజా స్థితిని గమనించి మంత్రులు చేసేదిలేక రాజ్యక్షేమం కోసం అతనిని బంధించారు. కాని అన్న పానీయాలు మానేసినందున రాజు స్వస్థత పూర్తిగా చెడి, నిర్బలుడై పోయాడు. ఇక తన రాణిని కలుసుకోడానికి మరణమే ఏకైకమార్గమని నిర్ణయించుకొని, అంతిమ ఘడియలను నిరీక్షిస్తూ, మంచం పట్టాడు. కానీ, మరణం అంత సులభసాధ్యంకాలేదు. వర్షాన్నా మాసాలు గడిచేకొద్దీ అతని జబ్బంతా క్రమక్రమంగా తగ్గ నారంభించింది. అతని భౌతిక దేహం ఇక్కడ వున్నదన్నమాటేగాని, ఆత్మ మాత్రం పరలోకంలోవున్న భార్యను విడిచిపెట్టలేక ఆమె మీదే లగ్నమై ఉండింది. అతని ముఖంమీద చిరునవ్వు అదృశ్యమైంది. చూపుల్లో అర్థం నశించింది. ఎప్పుడూ ఏకాంతంగా వుంటూ, శూన్యంలోకి చూచి, దిగులుతో ముఖం వాల్చేస్తూ వుండేవాడు. ఆమె స్వరూపం క్షణ క్షణం అతని కళ్ళకు కనిపించినప్పుడల్లా వియోగబాధ ముల్లులాగ అతని హృదయంలో గుచ్చుకునేది. అతని ఎర్రనైన కళ్ళు, విరియబోసుకున్న జుట్టు భయానకంగా వుండింది. ఎవరైనా రాజును సమీపించినపుడు బిడ్డను కోల్పోయిన తల్లి ఏనుగ దగ్గరికి వెళ్ళినట్లు గజగజ వణికేవారు. దుఃఖాగ్నిలో అతని తల బూడిద కప్పినట్లు నెరిసిపోయింది. కాలం ఈ అదును చూసుకొని అతని ముఖంలో ముడుతలుదిద్ది, పెదిమల చుట్టునూ, నుదురుపైనా వయసు రేఖలను చిత్రించింది.

## 3

ఒకనాడు పరమేశ్వరుడు, ఉమాదేవితోకూడి గగనవీధిలో విహరిస్తూ, చంద్రమండలం సమీపించాడు. అపుడు ఉన్నట్టుండి వారికి విడిచిపోయిన సఖుని కోసం వాపోవు చక్రవాక విలాపాన్ని బోలిన స్త్రీ ఆక్రందన వినవచ్చింది. అచ్చెరువంది వారు శశాంకుని రాజ్యంలోకి అడుగిడి ధ్వనివచ్చు మార్గాన్నిబట్టి వెళ్ళారు. అక్కడ ఒకచోట గంధపుచెట్టు బోదెకు ఆనుకొని, కన్నీరు ధారగా కారుస్తూ, కూర్చున్న ఒక సిద్ధురాలు కనబడింది. ఆమె జుట్టు చంద్రుని మరుగుపరిచే నల్లని మేఘాల్లా ముఖంమీదపడుంది. పార్వతీదేవికి ఆ సిద్ధురాలిపై జాలి కలిగింది. ఆమె విచారానికి కారణం తెలుసుకోవాలనే ఆసక్తితో పరమేశ్వరుని అడుగగా, సర్వమూ తెలుసుండి కూడా మహేశ్వరుడు తనంతట తానే చెప్పక ఆ వృత్తాంతము ఆ సిద్ధురాలినే అడుగమన్నాడు. అప్పుడు ఉమాదేవి ఆమెను తన దుఃఖ కారణమేమని అడుగగా, సిద్ధురాలు "హిమగిరితనయా! పుణ్య కార్యములు చేసినవారు ఈ లోకమునకు వచ్చి నిత్యానంద జీవితమనుభవిస్తారని ప్రతీతికదా! కానీ నా విషయంలో అది సత్యముకాదు. ఇలా సిద్ధురాలిగావున్నానన్నమాటేగాని నా హృదయంలో ఆనందం ఇసుమంతైనాలేదు. దీనికి కారణం నా పూర్వ జన్మ వృత్తాంతమంతా నాకు జ్ఞాపకముండడమే! నేను భూలోకంలోని నా హృదయేశ్వరుని విడిచి వచ్చింతర్వాత అక్కడ నా భర్త నాకోసం ఎలా విలపిస్తున్నాడో స్పష్టంగా చూడగలుగుతున్నాను. నే నెన్ని పుణ్యకృతులు చేసిననేమి? ఒక్కక్షణము నా భర్తను కలుసుకునే అవకాశ,మెవరైనా నాకు లభింపచేస్తే నా పుణ్యఫలమంతా వారి పాదాల ముందిడి ఆ మహదవకాశాన్ని పొందడానికి సిద్ధంగా వున్నాను. నా కదియే పదివేలు. నా ప్రాణేశ్వరునికి తోడునీడగా వుండలేని ఈ సిద్ధురాలి జీవితం నాకెందుకు? భగవంతుడు నాకు మరపును ప్రసాదించకుండా, ఈ పూర్వజన్మ జ్ఞాపకశక్తితో కుమిలిపొమ్మని నన్నెందుకు శపించాడో! దగ్ధమైపోయిన ఆనాటి ఆనందాన్ని, ఆవేదనతో నిండిన ఈ నాటి ఆత్మను ఈ పాతస్మృతులు గొలుసులా బంధిస్తున్నాయి" అంటూ బిగ్గరగా ఏడ్చింది.

ఈ విషాదగాథను విన్న గిరిజ, "ఎటులైన మీరు ఈ సిద్ధురాలి అభీష్టం నెరవేర్పవలె"నని ఈశ్వరుని కోరింది. పరమేశ్వరుడు చిరునవ్వుతో "ఉమా! స్త్రీల స్వభావాన్ని నీవు గుర్తించలేకున్నావు. వారు ప్రియునికోసం ముల్లోకాలను భస్మం చెయ్యటానికైనా సమ్మతిస్తారు. వారినిచూచి జాలిపడి ప్రకృతి నిర్ణయానికి విరుద్ధంగా వెళ్ళగలమా? గతించిన కాలం తిరిగిరాదు. రాకూడదు. మిథ్య అయిన ఇద్దరి ప్రేమికుల ఆనందంకోసం మళ్ళీ కాలంలో వెనుకకు ప్రయాణంచేస్తే అల్లకల్లోలం తప్పదు" అని నచ్చచెప్పాడు. కాని, గౌరిదేవి అదేమీ వినక, తన కోరికను మళ్ళీ మళ్ళీ వెల్లడిచేసి బ్రతిమలాడింది. ఇక కాదనలేక గిరీశుడు "పార్వతీ! వారి కోసమని ప్రపంచ క్షేమాన్ని చెడగొట్టడం సమంజసంకాదు. అయిననూ నీ సంతృప్తికోసం ఈ అభాగ్యులిద్దరూ ఈ చిన్న నాటకములోని వారి చిన్న పాత్రలను వారే మళ్ళీ నటించేటట్లు చేస్తాను. కాని స్వప్నంలో మాత్రమే యిది జరుగగలదు. కర్కశమై, వాస్తవమై సరిదిద్దలేని ఈ ప్రకృతి గుణాన్ని సరిదిద్దేందుకు మార్గంగా స్వప్నాన్ని భగ



